హైటెన్షన్ ఇబ్బందులు ఎన్నాళ్లు?

- ప్రమాదకరంగా 11కేవీ విద్యుత్ లైన్
- ఆదమరిస్తే ప్రమాదకరమే..
- ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు

అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లోని కాళికాలయం సమీపంలో 11 కేవీ విద్యుత్ లైన్ ద్వారా కాలనీ ప్రజలు ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నా సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. 30 ఏళ్ల నుంచి తమ ఇళ్ల మీదుగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలను మార్చమని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోక పోవడంతో సమస్య మరింత జఠిలంగా మారిందని వాపోయారు. మున్సిపాలిటీగా రూపాంతరం అయినా తమ కాలనీ సమస్యను మాత్రం పరిష్కరించలేకపోతున్నారని, సమస్య ఇలానే ఉంటే షార్ట్‌సర్క్యూట్ ఏర్పడితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంతో కాలం గడుపుతున్న పరిస్థితులు దాపరించాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తమ కాలనీలోని 50 ఇళ్ల మీదుగా వెళ్తున్న 11 కేవీ వ్యవసాయ విద్యుత్ లైన్‌ను మార్చాలని పలు సందర్భాల్లో ట్రాన్స్‌కో అధికారులను పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో నిలదీసిన దాటవేసే సమాధానాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. దీనిపై మున్సిపల్ అధికారులు సైతం మాట్లాడడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రూ.18 లక్షలతో ప్రతిపాదనలు

శ్రీకృష్ణ నగర్‌లోని కాళికాలయం, గొల్ల పెద్ద బుచ్చన్న ఇంటి నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలను మార్చేందుకు ట్రాన్స్‌కో అధికారులు సుమారు రూ.10 నుంచి 11 లక్షల వరకు అంచనాలు వేసి మున్సిపల్‌కు నివేదించారు. మున్సిపల్ పాలక వర్గం వీటిపై అధ్యయనం చేసి మొత్తంగా రూ.18 లక్షలు మంజూరు చేస్తే శాశ్వతంగా సమస్యను పరిష్కరించే అవకాశం ఉందని ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్‌తో పాటు ట్రాన్స్‌కో సీఎండీలకు పంపారు. ప్రతిపాదనలు పంపినా నేటికీ నిధులు మంజూరు కాకపోవడంతో విద్యుత్ లైన్ మార్చే ప్రయత్నాలు చేపట్టలేక పోతున్నారు. మున్సిపాలిటీలో సొంత నిధులు లేకపోవడంతో సమస్యను మరుగున పడేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో ఇళ్ల మధ్య 11 కేవీ విద్యుత్ లైన్లు

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం



తమ కాలనీలో 11 కేవీ విద్యుత్ తీగలు ఇళ్ల మధ్య ఉన్నందున ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయే అనే భయంతో సమస్యను మున్సిపల్ అధికారులకు విన్నవించాం. పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో వచ్చే అధికారులకు సైతం సమస్యను విన్నవించినా ఫలితం లేదు. 11 కేవీ విద్యుత్‌లైన్ ద్వారా 50 కుటుంబాలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని భయపడుతు బతుకుతున్నాం.

– చింతకుంట వెంకటేష్, అమరచింత

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం నిల్వలు

- తాలు పేరుతో తరుగు తీయడం సరికాదు
- అధికారులు స్పందించి రైతుల ఇబ్బందులు తొలగించాలి
- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం బస్తాలను తరలించి రైతుల ఇబ్బందులు తొలగించాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం కాంటా కాకపోవడం, ధాన్యం తరలింపులో జాప్యం, తాలు పేరుతో తరుగు తీయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో ఆయా సమస్యలపై రైతులు ఆందోళనలు, రాస్తారోకోలు చేస్తున్నారంటే రైతులు ఇబ్బందులు అర్థమవుతున్నాయన్నారు. పండించిన ధాన్యం విక్రయించడానికి కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని మండిపడ్డారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ధాన్యం విక్రయంలో రైతులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి లారీలను పంపించి ధాన్యం నిల్వలను తరలించడంతో పాటు ధాన్యం సేకరణను వేగవంతం చేయాలన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడి రైతుల ఇబ్బందులను వివరించి, కొనుగోలు కేంద్రాలను సందర్శించి సమస్యను పరిష్కరించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే రైతులతో కలిసి పోరాటాలు కొనసాగిస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్, వెంకటయ్యనాయుడు, జ్యోతినందన్‌రెడ్డి, వీరసాగర్, నర్సింహ, బండి సరోజమ్మ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాంబాబునాయక్, నవీన్‌రెడ్డి, హన్మంతు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జనరల్ ఆస్పత్రిలో వైద్యుల కొరత


రోగులతో మాట్లాడుతున్న యుగంధర్‌గౌడ్

వనపర్తి: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసినా.. కావాల్సిన వైద్యులు లేక వైద్యసేవల కోసం వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ చెప్పారు. శనివారం ఆయన జీజీహెచ్‌ను సందర్శించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు, వైద్యుల, సిబ్బంది కొరతను ఆర్‌ఎంవో డాక్టర్ జావేద్ ను అడిగి తెలుసుకున్నారు. ఉన్న కొద్దిమంది వైద్యులే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ పని ఒత్తిడికి గురవుతున్నారని, జిల్లా జనరల్ ఆస్పత్రికి అనుగుణంగా వైద్యులను నియమించాలన్నారు. 39 ప్రొఫెసర్ పోస్టులకు గాను 14 మంది మాత్రమే ఉన్నారని, అసోసియేట్ పోస్టులు 26 ఖాళీగా ఉన్నాయని, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు సుమారు 65, ట్యూటర్ పోస్టులు 8, ఎస్ఆర్ చాలా తక్కువగా ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో దేవర శివ, అంజన్న యాదవ్, ధర్మేంధర్, రాఘవేందర్, రామన్‌గౌడ్, గిరిధర్‌గౌడ్, చందు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని గోదాంలో నిల్వ చేస్తాం


పాన్‌గల్‌లోని గోదాం సామర్థ్యంపై జూనియర్ అసిస్టెంట్‌తో మాట్లాడుతున్న నాయకులు

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం బస్తాలను మండల కేంద్రంలోని గిడ్డంగుల కార్పొరేషన్ గోదాంలో నిల్వ చేసి రైతుల ఇబ్బందులను తొలగిస్తామని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్ సాగర్ అన్నారు. శనివారం మండల నాయకులతో కలిసి గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం తరలించడంలో జరుగుతున్న జాప్యం గురించి మంత్రి జూపల్లికి వివరించామని, మంత్రి ఆదేశాలతో గోదాంను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గోదాంలో 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే సామర్థ్యం ఉందని, దీంతో మండలంలోని సింగిల్‌విండో, ఐకేపీ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలను గోదాంలో నిల్వ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని మంత్రి జిల్లా అధికారులను ఆదేశించారని వివరించారు. ధాన్యం బస్తాలను తరలించడంతో పాటు ధాన్యం సేకరణలో వేగం పెంచాలని నిర్వాహకులకు సూచించామన్నారు. గోదాంలో బస్తాలు దించేలా పరిసరాలను శుభ్రం చేయించాలని జూనియర్ అసిస్టెంట్ వెంకటస్వామికి సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, పుల్లారావు, జయరాములుసాగర్, వాల్మీకినాయుడు, నరేందర్‌గౌడు, పులేందర్, ఐలీయాస్, దర్గయ్యనాయుడు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

వనపర్తి రూరల్: కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త కార్మికుల సార్వత్రిక సమ్మెకు హాజరై జయప్రదం చేయాలని శనివారం సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, ఎల్ఐసీ, ఐసీటీయూ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ వందేళ్లు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తెచ్చిందని, అవి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుట్ట ఆంజనేయులు, మండ్ల రాజు, మోష, గణేష్, గంధం మదన్, సునీత, గోపాలకృష్ణ, రమేష్, రామకృష్ణ, ఆర్ఎన్ రమేష్, బాలస్వామి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని జూరాలలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమై సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

‘గుడిసెల పోరు’ పేదలకు ఇంటి పట్టాలు అందేనా..


దుంపాయికుంటలో ఏర్పాటు చేసుకున్న గుడిసెలు

అమరచింత: పట్టణంలోని దుంపాయికుంటలోని సర్వే నంబర్ 534లో నిరుపేదలకు కేటాయించిన ఇంటి స్థలాల వ్యవహారంలో పొజిషన్‌తో పాటు హద్దులు చూపాలంటూ గుడిసెలు వేసుకుని పోరాటం చేస్తున్న పేదలకు ఇంటి పట్టాలు ఎప్పుడిస్తారో అని ఎదురు చూడాల్సిన పరిస్థితులు దాపరించాయి. రెండున్నరేళ్ల కిందట పట్టణానికి చెందిన దుంపాయికుంట ఇంటి స్థలాల లబ్ధిదారులు తమకు ఇంటి స్థలాలు చూపడంతో పాటు ఇంటి నిర్మాణానికి నిధులు ఇవ్వాలంటూ గుడిసెలు వేసుకుని పోరాటం చేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ సమస్యను పట్టించుకోకపోవడంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైన తమ సమస్య తీర్చుతుందని ఆశపడినా వారి మొండిచెయ్యే దక్కింది. నిరుపేదలు పలు మార్లు సీపీఎం మద్దతుతో ధర్నాలు, అధికారులపై నిరసన నిర్వహించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని సైతం అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాలతో దుంపాయికుంటలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలను తొలగించి ఇంటి స్థలాల కోసం సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు కేవలం ముళ్ల పొదలను తొలగించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే స్పందించి తమ సమస్యను వెంటనే పరిష్కరించి ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం



ఉండవెల్లి: మండలంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మైనార్టీ విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎలిజిబిత్ సుహాసిని తెలిపారు. శనివారం మైనార్టీ పెద్దలతో పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గురుకులంలో ఇంటర్‌కు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. గురుకులంలో ప్రైవేటు దీటుగా ఉత్తమ విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు చిన్నబాస్ మియా, మక్తర్ బాషా, రఫీక్, మక్బుల్ బాషా, చాంద్‌బాషా పాల్గొన్నారు.

‘అన్నదాతలారా.. ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దు’

వనపర్తి రూరల్: కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు స్వలాభం కోసం రైతులను రెచ్చగొట్టి పబ్బం గుడుపుకోవాలని చూస్తున్నారని, అలాంటి వారిని పట్టించుకోవద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం ఎక్స్ రోడ్డు వద్ద కొంతమంది రైతులకు మాయ మాటలు చెప్పి బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని, సీఎం రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమమే అజెండాగా పనులు చేస్తున్నారని కొనియాడారు. గత బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఎప్పుడైనా పంటలు కోల్పోయిన రైతులకు సహాయం అందించారా అని ప్రశ్నించారు. జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న 2,986 మంది రైతులకు సంబంధించిన పంటలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల చొప్పున చెల్లించారన్నారు. సాంకేతిక కారణాల వల్ల కొంత ఆలస్యం అవుతున్నా ప్రతి గింజ పూర్తిగా కొనుగోలు చేయడమే కాకుండా తడిచిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొంటుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ నాయకులకే మిల్లులు అధికంగా ఉండేవని, రూ.కోట్ల విలువ చేసే ధాన్యాన్ని ప్రభుత్వానికి చెల్లించకుండా ఎగనామం పెట్టారని ధ్వజమెత్తారు. ఈ రోజు ఎక్కడికక్కడ అలాంటి మిల్లులపైన ప్రభుత్వం రికవరీ చేసేటువంటి దశలో ఈ విధమైన కృతిమ ధర్నాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.

పాఠశాలలో చోరీ

ధరూరు: మండల పరిధిలోని మన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు గుర్తు తెలియని దుండగులు. పాఠశాలలకు సెలవుల నేపథ్యంలో ఆఫీసు రూంతో పాటు ఇతర గదులకు వేసిన తాళాలు దుండగులు పగులగొట్టి నోట్ పుస్తకాలు, సామగ్రిని ఎత్తుకెళ్లారు. శనివారం పాఠశాల పరిసర ప్రాంతాల్లోని స్థానికులు సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం తెలియజేశారు. దొంగతనంపై రేవులపల్లి పోలీసులకు సమాచారం అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు.

మొండికుంట చెరువు మత్స్యకారులకే..


వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద వనపర్తి మత్స్యకారులు

వనపర్తి విద్యావిభాగం: వనపర్తి మత్స్య పారిశ్రామిక సొసైటీ తెలుగు సంఘానికి సంబంధించి మొండికుంట చెరువు వివాదం వీడింది. ప్రైవేట్ వ్యక్తులకు, మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులకు మధ్య చెరువుకు సంబంధించిన పంచాయతీలో శనివారం వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఆధ్వర్యంలో చెరువు వనపర్తి మత్స్యకార సొసైటీకి చెందుతుందని నిర్ధారించారు. ఫిషరీస్ వనపర్తి జిల్లా ఏడీ స్థానిక మత్స్యకారులు చేపలు పట్టుకునేందుకు అనుమతి పత్రం ఇచ్చారు. వనపర్తి జిల్లా రెవెన్యూ శాఖ ఇచ్చిన సర్టిఫికెట్, చెరువుకు రకం కట్టిన పత్రాలు అన్నింటిని పరిశీలించిన ఎస్ఐ మొండికుంట చెరువు వనపర్తి మత్స్య పారిశ్రామిక సంఘానికి చెందుతుందని, వారికే చేపలు పట్టుకునేందుకు హక్కు అని వారి విచారణలో తేలిందన్నారు. ఈ చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లిన లేదా చేపలు పడుతున్న మత్స్యకారులను అడ్డుకుంటే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు మత్స్యకార సంఘం అధ్యక్షుడు నందిమల్ల చంద్రమౌళి, మత్స్యపారిశ్రామిక పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బొలమోని కృష్ణయ్య, డైరెక్టర్లు కోటి లక్ష్మయ్య, పెద్దలు బొలమోని నాగేంద్రం, రంగం బాలస్వామి, రంగం మన్యం, కొండ స్వామి, వెంకటేష్, రాములు, కురుమూర్తి, కుల సంఘం పెద్దలు, యువజన సభ్యులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

బిజినేపల్లి: ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగనమోని తిరుపతయ్య, కత్తె ఈశ్వర్, అమృత్‌రెడ్డి, మిద్దె రాములు, మధుసూదన్ రెడ్డి, కదిరె రాము, అభిషేక్‌రెడ్డి, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా చూడాలి


క్రీడాకారులతో ఎస్పీ రావుల గిరిధర్, ఎస్ఐ యుగంధర్‌రెడ్డి

వనపర్తి: ఆటలోని గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించి, క్రీడల్లో అద్భుతమైన ప్రతిభ కనపర్చాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లిలో నిర్వహిస్తున్న భూ సమేత శ్రీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవ కార్యక్రమం, ఉమ్మడి తెలుగు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఎస్పీ రావుల గిరిధర్ ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలకు హాజరైన ఎస్పీ దేవాలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్ణ కుంభంతో స్వాగతం పలికి స్వామివారికి పూజా కార్యక్రమం నిర్వహించి ఎస్పీని సన్మానించారు. సాంప్రదాయ నృత్యాలతో భక్తులను అలరించిన మహిళలను అభినందించి 2వేల నగదు బహుమానం అందజేశారు. అనంతరం ఉమ్మడి తెలుగు రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అనంతరం టాస్ వేసి ఇరుజట్ల క్రీడాకారులను కరచాలనం చేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్‌రెడ్డి, తేజవర్ధన్, గోపాల్, నీలవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, భాస్కర్, శ్యాంసుందర్, రాము, బాలగౌడ్, సోమగౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల నుంచి ధాన్యం తరలించాలి


వెంకటాపురం ఎక్స్‌రోడ్డుపై రైతుల ధర్నా

వనపర్తి రూరల్: వరి కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం సేకరించడంతో పాటు వెంటనే మిల్లుకు తరలించాలని శనివారం శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం ఎక్స్ రోడ్డు వద్ద కొల్లాపూర్ రహదారిపై రైతులు సుమారు గంట పాటు బైఠాయించారు. రైతులతో ధాన్యం సేకరించి 5 రోజులు గడుస్తున్నా లారీలు రాకపోవడంతో కేంద్రాల్లో ధాన్యం నిలిచి పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి లారీలు అందుబాటులో ఉంచాలని కోరారు. స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జగన్నాథంనాయుడు, వెంకటేశ్వరెడ్డి, రాధాకృష్ణ, వెంకటయ్య, నగేష్, పరశురాముడు, అర్జున్, పర్వతాలు, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

వీరజవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి


చందాపురంలో మౌనం పాటిస్తున్న కూలీలు


ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: పాకిస్తాన్ ముష్కరులపై పోరులో వీర మరణం పొందిన భారత సైనికుడు మురళీనాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు. శనివారం రాత్రి స్థానిక గాంధీచౌక్‌లో, మండలంలోని బాలకిష్టాపూర్‌తండాలో, కత్తేపల్లిలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. భారత సైనికులకు అండగా ఉంటామని, ఉగ్రవాదాన్ని తుదిముట్టించాలని కోరారు.

వనపర్తి రూరల్: భారత్, పాకిస్తాన్ ఉద్రిక్త పరిస్థితుల్లో అమరులైన జవాన్ తెలుగు తేజం మురళీనాయక్‌కు శనివారం మండలంలోని చందాపూర్‌లో ఉపాధి పనుల వద్ద కూలీలు నినాదాలు చేస్తూ ఘనంగా నివాళులర్పించి, నిమిషం మౌనం పాటించారు.

కొల్లాపూర్: భారత్–పాక్ మధ్య జరుగుతున్న యుద్ధంలో అమరులైన జవాన్లు మురళీనాయక్, సచిన్ యాదవ్‌లకు కొల్లాపూర్ తైక్వాండో కింగ్స్ క్లబ్ సభ్యులు నివాళులర్పించారు. శనివారం సాయంత్రం తైక్వాండో శిక్షణా శిబిరం వద్ద విద్యార్థులతో కలిసి వారు అమర జవాన్లను స్మరిస్తూ కొద్దిసేపు మౌనం పాటించారు. దేశ భద్రత కోసం జరుగుతున్న పోరాటంలో అసువులు బాసిన జవాన్లు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్‌లు భాస్కర్‌యాదవ్, శరబందరాజు, శివకుమార్‌యాదవ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

గద్వాల: ఉగ్రమూకలను అణిచివేస్తున్న సైనికుల క్షేమం కోసం బీజేపీ పట్టణ అధ్యక్షురాలు జయశ్రీ ఆధ్వర్యంలో గద్వాల కోటలోని భూలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న సైనికులకు విజయం చేకూరాలని పూజలు చేస్తున్నట్లు జయశ్రీ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.


బాలకిష్టాపూర్‌లో నివాళులర్పిస్తున్న స్థానికులు


కత్తేపల్లిలో..

క్లుప్తంగా

భూ తగాదాల్లో నలుగురికి రిమాండ్

ఖిల్లాఘనపురం: భూతగాదాల్లో గొడవలు పెట్టుకొని దాడి చేసిన నలుగురు వ్యక్తులకు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 23న ఖిల్లాఘనపురం మండలంలోని కర్నెతండాకు చెందిన కొడావత్ కిషన్‌కు చెందిన భూముల హద్దుల విషయంలో ఆయనతో పాటుగా కుటుంబ సభ్యులపై అదే తండాకు చెందిన ఇస్లావత్ శ్రీను, ఇస్లావత్ విజయ్, ఇస్లావత్ రవి, ఇస్లావత్ రవి దాడి చేసి గాయపర్చారు. ఈ విషయమై కొడావత్ కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ దర్యాప్తు చేసి దాడి చేసిన వ్యక్తులను కోర్టులో హాజరుపర్చారు. విచారణ చేసిన న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం బస్తాలు పడి హమాలీలకు గాయాలు

పాన్‌గల్: ధాన్యం బస్తాలు పడి హమాలీలకు గాయాలైన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. బాధిత హమాలీలు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఈదమ్మ గుడి సమీపంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ధాన్యం కాంటా చేసి ధాన్యం బస్తాలను లారీలోకి లోడ్ చేస్తున్న క్రమంలో సామర్థ్యానికి మించి బస్తాలు ఎత్తడంతో ఒక్కసారిగా లారీ ఒక పక్కకు ఒరిగింది. దీంతో ధాన్యం బస్తాలు తెలుగు రాములు, యాదగిరిరెడ్డి, గొల్లరాములుపై పడటంతో తెలుగు రాములుకు కుడికాలు ఫ్యాక్చర్ కావడంతో మిగితా వారికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రభుత్వ పరంగా సహాయం చేసి ఆదుకోవాలని హమాలీలు కోరుతున్నారు. ఈ విషయంపై ఐకేపీ ఏపీఎం వెంకటేష్‌యాదవ్‌ను వివరణ కోరగా.. ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా అధికారులకు నివేదించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి



ఆత్మకూర్: ఫొటోగ్రాఫర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు మణ్యం, ఉపాధ్యక్షుడు నవీన్‌శ్రీను, ప్రధాన కార్యదర్శి తౌఫీక్ అన్నారు. శనివారం ఫొటో స్టూడియోల బంద్ నిర్వహించి స్థానిక మార్కెట్ యార్డు ఆవరణంలో సమావేశమయ్యారు. ఒకప్పుడు వినియోగదారులతో వెలిగిపోయిన ఫొటో స్టూడియోలు సెల్‌ఫోన్ల కారణంగా గిరాకులు లేక వెలవెల బోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేయడంతో పాటు ఆధునిక కెమెరాలు, రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు, రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరాములు, జగన్, తిరుపతి, అనిల్, ప్రసాద్, రంజిత్, లక్ష్మణ్, రాజశేఖర్, వెంకట్రాములు, ప్రేమ్‌కుమార్, నరేష్, రవి, నర్సింహ, ఖాజీ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఉపాధి పనులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శనివారం 1342 మంది ఉపాధి కూలీలు ఫీడర్ ఛానల్, ల్యాండ్ లెవలింగ్ పనులు చేస్తున్నారు. కొత్తగా పనులకు వచ్చే కూలీలు ఆయా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా జాబ్ కార్డులు పొందిన తర్వాత పనులకు రావాలని సూచించారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి.

ఉరి వేసుకుని బాలిక మృతి

కొత్తకోట రూరల్: ఉరి వేసుకుని 13ఏళ్ల బాలిక మృతి చెందిన ఘటన కొత్తకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన భారతిని 25ఏళ్ల క్రితం పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన వెంకటేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ప్రశాంతి (13), గణేష్ అనే ఇద్దరు సంతానం కలరు. భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా భారతి కొంతకాలంగా పిల్లలతో కలిసి కొత్తకోట పట్టణ కేంద్రంలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. చింతకుంట గ్రామానికి చెందిన సాయిబాబా అనే వ్యక్తితో కొంతకాలంగా భారతి సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో భారతి కుమార్తె ప్రశాంతి శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రశాంతి మృతిపై అనుమానం ఉన్నట్లు మేనమామ రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.